# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

❖ బందరు పోర్టును 2025 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

❖ శ్రీకాకుళం జిల్లాలో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.

❖ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారి కోసం పోర్టల్ ను త్వరలో ప్రారంభిస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు.

❖ విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో రేపటి నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి.

❖ "కాల్ మనీ" పేరుతో అధిక వడ్డీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు.

=====================

బందరు పోర్టును 2025 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పోర్టు పనులను ఈరోజు పరిశీలించిన అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, అమరావతికి అనుసంధానంగా పోర్టును అభివృద్ధి చేస్తామని అన్నారు. పరిశ్రమలకు కూడా అవకాశం ఇస్తే ఎగుమతులు పెరుగుతాయని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

=====================

శ్రీకాకుళం జిల్లాలో విమానాశ్రయం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. జిల్లాలోని పాతపట్నంలో "ప్రధానమంత్రి జన్ మన్" వసతి గృహానికి రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో కలిసి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో కేంద్రమంత్రి మాట్లాడుతూ, భోగాపురం విమానాశ్రయ నిర్మాణం అనుకున్న కాలపరిమితిలో పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... అత్యంత వెనుకబాటుకు గురైన పాతపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

======================

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారి కోసం ఒక పోర్టల్ ని త్వరలో ప్రారంభిస్తున్నామని సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. దీని ద్వారా అన్ని రకాల అనుమతులు పొందడం సులభతరం చేస్తున్నట్లు వెల్లడించారు. అమెరికాలోని డల్లాస్ లో ప్రవాస భారతీయులు నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. వారికి కావాల్సిన అన్ని రకాల వసతులు, అనుమతులు వెంటనే ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, హెల్త్ కేర్ తదితర రంగాల్లో పెట్టుబడులకు రాష్ట్రం అనుకూలమని తెలిపారు.

======================

విజయవాడ ఇంద్రకీలాద్రిపైన వెలసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు రేపటి నుండి ప్రారంభం అవుతున్నాయి. ఈ నెల 12వ తేదీ వరకూ కొనసాగే ఈ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లను ఆలయ అధికారులు పూర్తి చేశారు. అమ్మవారికి 10 రోజుల పాటు ప్రత్యేక అలంకారాలు చేయనున్నారు. మూలా నక్షత్రం రోజున అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. ఇదిలా ఉండగా, ఉమ్మడి కర్నూలు జిల్లాలోని శ్రీశైలంలో దసరా నవరాత్రి మహోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు తెలిపారు. రేపు యాగశాల ప్రవేశంతో శాస్త్రోక్తంగా ఉత్సవాలను ప్రారంభిస్తామని వివరించారు.

======================

తిరుపతిలోని తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో రేపటి నుండి ఈ నెల 12వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజు పద్మావతి అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు వెల్లడించారు. 12న విజయదశమి సందర్భంగా రాత్రి పద్మావతి అమ్మవారు గజ వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.

======================

శ్రీకాకుళం జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రం అరసవిల్లిలో అద్భుత దృశ్యం భక్తులకు కనువిందు చేసింది. ఆలయంలోని శ్రీ సూర్యనారాయణ స్వామి వారి మూలవిరాట్టును సూర్యకిరణాలు ఈ రోజు 2 నిమిషాలు పాటు తాకాయి. ఈ అద్భుత దృశ్యాన్ని చూసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రతి ఏటా దక్షిణాయలో అక్టోబర్ 1, 2వ తేదీలు, ఉత్తరాయణంలో మార్చి 9, 10 తేదీల్లో మూల విరాట్‌ను సూర్యకిరణాలు నేరుగా తాకుతాయని ఆలయ అధికారులు తెలిపారు.

======================

అధిక వడ్డీలు, అక్రమ వసూళ్లు చేసే వారి మీద క్రిమినల్ కేసులు పెడతామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. ఏలూరు కాల్ మనీ ఘటనపై ఆమె ఈ రోజు స్పందించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రోజువారీ వడ్డీల పేరిట సామాన్య జనాలను వేధించే వారిని విడిచిపెట్టేది లేదని స్పష్టం చేశారు. కాగా, ఇప్పటికే ఏలూరు ఎస్పీతో మంత్రి ఫోన్ లో మాట్లాడి "కాల్ మనీ" వ్యవహారం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విరామం

======================

మహాత్మా గాంధీ 155వ జయంతి సందర్భంగా విశాఖపట్నంలో భారతీయ జనతా పార్టీ నగర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సీఎం రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మహాత్ముడు దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఆ వివరాలను మా విశాఖ ఆకాశవాణి ప్రతినిధి మూర్తి తెలియచేస్తూ...

(వాయిస్ 38 సెకన్లు)

======================

రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు "స్వచ్ఛతా హీ సేవ" కార్యక్రమాలు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికులే సమాజంలో నిజమైన హీరోలు అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఒంగోలు మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఈ రోజు నిర్వహించిన ఉత్తమ పారిశుధ్య కార్మిక పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఇక పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ పాల్గొన్నారు.

గుంటూరు నగరంలో జరిగిన "స్వచ్ఛతా హీ సేవా" ముగింపు కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొని మొక్కలను నాటారు.

రైల్వే స్టేషన్లను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ నరేంద్ర ఆనంద్ రావు పాటిల్ అన్నారు.

======================

రాష్ట్రంలో చెత్త పన్నును రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కృష్ణా జిల్లాలోని మచిలీపట్నంలో ఈ రోజు నిర్వహించిన "స్వచ్ఛతా హీ సేవా" కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఈ రోజు నుండి చెత్త పన్ను ఎక్కడా వసూలు చేయవద్దని అధికారులను ఆదేశించారు. "స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్" లక్ష్యంగా అంతా పనిచేయాలని కోరారు. కాగా, మచిలీపట్నం కళాశాలను ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుంటామని, రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతామని అన్నారు.

======================

రాష్ట్రవ్యాప్తంగా ఈ రోజు మహాత్మా గాంధీ 155వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమరావతిలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జాతిపిత మహాత్మా గాంధీతో పాటు దేశ రెండవ ప్రధానమంత్రి లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

మహాత్ముల ఆశయాలను ఆచరణలో చూపడమే వారికి అందించే నిజమైన నివాళి అని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జిల్లా పోలీసు కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీజీకి 155వ జయంతి సందర్భంగా ఎస్.పి. అమిత్ బర్దర్ నివాళులర్పించారు.

అనకాపల్లి జిల్లాలో మహాత్మా గాంధీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జి. అనకాపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కొణతాల రామ కృష్ణ పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

======================

కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్  కమ్యూనికేషన్ (సీబీసీ) గుంటూరు క్షేత్ర కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "స్వచ్ఛతా హీ సేవా" కార్యక్రమాలు గాంధీ జయంతితో ఘనంగా ముగిసాయి. "స్వచ్ఛ భారత్" 10వ వార్షికోత్సవ సందర్భంగా సీబీసీ సిబ్బంది సెప్టెంబరు 17వ తేదీ నుంచి స్థానిక ప్రజలతో కలిసి స్వభావం స్వచ్ఛత, సంస్కారం స్వచ్ఛత ఇతివృత్తంతో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.  గుంటూరుతో సహా  వివిధ ప్రాంతాలలో సీబీసీ ఆధ్వర్యంలో జరిగిన "స్వచ్ఛతా హీ సేవా" ప్రతిజ్ఞ, శ్రమదానం, యువ భాగస్వామ్య కార్యక్రమాల్లో దాదాపు రెండు వేలమంది పాల్గొన్నారని గుంటూరు క్షేత్ర ప్రచార అధికారి ఆర్ రమేష్ చంద్ర తెలియచేశారు.

======================

======================